సుద్దాలలో బురదమయంగా మట్టి రోడ్డు

బురద రోడ్డుతో అవస్థలు

చెన్నూర్ రూరల్, మే 15 : చెన్నూర్ మండలం సుద్దాల గ్రామంలో రామాలయం పక్కన రోడ్డుపై వర్షపు నీరు నిలిచి, బురదమయంగా మారింది. దీంతో దారి గుండా వచ్చే వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా నిర్మించిన వంతెన మట్టి రోడ్డుపై ఉండడంతో చిత్తడిగా మారిందని గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి, మట్టిని తొలగించాలని కోరుతున్నారు.

రోడ్డుపై ఒకేసారి వెళ్లలేక ఆగిపోయిన ఎడ్లబండి, కారు

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు

కన్నెపల్లి, మే 15 : కన్నెపల్లి మండల కేంద్రంలో ఇటీవల నిర్మించిన సిమెంటు రోడ్డు ఇరుకుగా మారింది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సుమారు 30 ఫీట్లుగా ఉన్న రోడ్డును.. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ప్రస్తుతం 12.4 ఫీట్లకు కుదించి నిర్మించారు. దీంతో రెండు వాహనాలు సరిగా వెళ్లలేకపోతున్నాయి. కన్నెపల్లి మండల కేంద్రం నుంచి వేమనపల్లి, నెన్నెల మండలాలకు నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈ రోడ్డు గుండానే వెళ్తుంటాయి. వేసిన రోడ్డుకు కూడా సరైన వాటర్ క్యూరింగ్ చేయకపోవడంతో త్వరగా శిథిలమయ్యేలా ఉన్నదని, అధికారులు స్పందించి డబుల్ రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

కంకర వేశారు.. నిర్మాణం మరిచారు

రోడ్డు నిర్మాణం చేపట్టక ప్రయాణికుల ఇబ్బందులు

చింతలమానేపల్లి, మే 15 : రహదారుల నిర్మాణాల కోసం రోడ్లు తవ్వి.. కంకర వేశారు. కానీ, బీటీ రోడ్డు వేయకుండా వదిలేశారు. కంకర మాత్రమే పరిచి ఉంచడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మండలంలోని చింతలమానేపల్లి-కర్జెల్లి.., రవీంద్రనగర్-రణ్‌వెల్లి.., చింతలమానేపల్లి-బాబాసాగర్, తదితర బీటీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. పనులను పూర్తి చేయాల్సి ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీన్ రివర్స్ అయ్యింది. గుత్తేదారులు ఐదు నెలల క్రితం పనులు మొదలు పెట్టి, నేటికీ పూర్తి చేయడం లేదు. పనుల్లో మొదటగా చూపిన శ్రద్ధ ప్రస్తుతం కరువైంది. దీంతో రోడ్ల నిర్మాణాలు లేక మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారులను కోరుతున్నారు. కంకర మాత్రమే ఉండడంతో వాహనాల రాకపోకలతో దమ్ములేచి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వాటరింగ్ కూడా చేయకపోవడం అధికారులు, గుత్తేదారుల నిర్లక్ష్యం కనబడుతున్నదని మండలవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కంకర మాత్రమే వేసి వదిలేసిన రవీంద్రనగర్-బాబాపూర్ రోడ్డు

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

- చర్యలు తీసుకోవాలని సభ్యుల డిమాండ్
- జైపూర్ ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం

జైపూర్, మే 15 : జైపూర్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ గోదారి రమాదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పూర్తి స్థాయిలో అధికారులు హాజరుకాకపోవడంపై సభ్యులు మండిపడ్డారు. గైర్హాజరు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమవ్వాల్సిన సమావేశం పూర్తిస్థాయిలో అధికారులు సమావేశానికి రానందున ఆలస్యంగా ప్రారంభమైంది. వ్యవసాయం, విద్యుత్‌పై చర్చ జరిగింది. కాంగ్రెస్ ప్రారంభించిన ఆరు గ్యారెంటీల్లో గృహజ్యోతి పథకం అందడంలేదని, అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులతో చర్చించారు. అలాగే అనధికారికంగా కరెంటు కోతలు విధిస్తున్నారన్నారు. రైతుబంధు పూర్తిస్థాయిలో అందలేదని, ఇందుకు సంబంధించిన వివరాలు తెలియజేయాలని సభ్యులు వ్యవసాయాధికారులను కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన సభ్యులు

దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట, మే 15 : కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీలోగా tsmodelschools.com వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపులలో 40 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతిలో పొందిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో ఉచిత విద్యతో పాటు, యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, వొకేషనల్ విద్యా బోధన, డిజిటల్ పద్ధతిలో విద్యా బోధన, బాలికలకు హాస్టల్ వసతి ఉంటుందని వెల్లడించారు. పూర్తి వివరాలకు 95509 32264 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బహిరంగ ప్రకటన

సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా తాటికొండ తిరుపతి, S/o. రామయ్య, R/o. వినాయక బస్తి, CCC నస్పూర్, మం॥ నస్పూర్, జిల్లా మంచిర్యాల గారు మార్టిగేజ్‌లోను నిమిత్తము మంచిర్యాల జిల్లా, నస్పూర్‌లోని విద్యానగర్ లోకాలిటీలో సర్వే నెం. 78, విస్తీర్ణం 277.77 చ.గ.లలో నిర్మితమైన RCC గృహము నెం. 8-182/2 గల దానిని HDB FINANCIAL SERVICES LTD మంచిర్యాల బ్రాంచ్ గారికి తనఖా పెట్టుటకు దరఖాస్తు సమర్పించియున్నారు. లోగడ తాటికొండ తిరుపతి గారు ఇట్టి ఇంటి ప్లాటును సాయిని అశాలు, S/o. పోశయ్య, R/o. విద్యానగర్, నస్పూర్, జిల్లా మంచిర్యాల గారి నుండి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 7423/2022 ద్వారా ఖరీదు చేసినారు. ఇట్టి డాక్యుమెంటు యొక్క ఒరిజినల్ లింకు డాక్యుమెంటు రిజిస్టర్ సేల్‌డీడ్ నెం. 4475/2001 గలది పోయినదని తాటికొండ తిరుపతి గారు తెలిపినారు. కావున ఇట్టి దస్తావేజుపై గాని లేదా పై ప్రాపర్టీపై గాని ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల వ్రాత పూర్వక ఆధారాలతో (7) రోజులలో తెలుపగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరములు లేవని భావించి సదరు లోను మంజూరు విషయంలో HDB FINANCIAL SERVICES LTD మంచిర్యాల బ్రాంచ్ వారు ప్రొసీడుకాగలరు.

ఇట్లు: సం/- సాన చంద్రమోహన్ అడ్వకేట్
(TS/138/1995) ప్లాట్ నెం.303, శ్రీసాయి ఎవెన్యూ ముకరంపుర, కరీంనగర్. సెల్: 9666077777, 9141499999.

నమస్తే తెలంగాణ CLASSIFIED

RECRUITMENT

★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253

NT-3277

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

టీఎస్ఎంసీ దాడులను నిలిపివేయాలి

మాట్లాడుతున్న నాయకులు

మందమర్రి, మే 15 : ప్రథమ చికిత్స కేంద్రాలపై తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్(టీఎస్ఎంసీ) దాడులను నిలిపివేయాలని ఆర్ఎంపీ, పీఎంపీ రాష్ట్ర కార్యదర్శి గాదాసు శంకరయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగు రవీందర్, మందమర్రి పట్టణాధ్యక్షుడు కట్ల శ్రీనివాస్ కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం 429/1273 జీవో జారీ చేసి, ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో 1000 గంటల శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తమకు గుర్తింపు పత్రాలే ఇచ్చేందుకు శిక్షణ ఇవ్వగా, దురదృష్టవశాత్తు నిలిచి పోయిందన్నారు. ప్రభుత్వం తమకు శిక్షణ ఇచ్చి, ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నదని తెలిపారు. ఆ హామీ మేరకు శిక్షణ ఇచ్చి, ధ్రువీకరణ పత్రాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రాథమిక వైద్యుల సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి గాజుల శంకర్, కోశాధికారి ఆయిల్ల లక్ష్మణ్, మంద తిరుమల్ రెడ్డి, టీ రవికుమార్, ఆర్ వెంకటేశం, మతీన్‌ఖాన్, గోనె సత్యం, రవి, పోశం, సత్యనారాయణ, రవీందర్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక వైద్యశాలలపై టీఎస్ఎంసీ దాడులు

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక వైద్యశాలలపై బుధవారం తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్(టీఎస్ఎంసీ) విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. పట్టణంలోని పాలచెట్టు, మార్కెట్, పాతబస్టాండ్ ఏరియాల్లోని పలు ప్రాథమిక వైద్యశాలలతో పాటు మెడికల్ దుకాణాలను తనిఖీ చేశారు. ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు వారి వద్దకు వచ్చే రోగులకు అందిస్తున్న వైద్యం తీరు, ప్రాథమిక వైద్యశాలలో సౌకర్యాలను పరిశీలించారు. ఆర్ఎంపీలు, పీఎంపీలకు వైద్యం చేసే అర్హత లేదని, కేవలం ప్రాథమిక చికిత్స అందించాలని సూచించారు. అర్హత లేకున్నా వైద్యం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సాధారణ తనిఖీల్లో భాగంగా టీఎస్ఎంసీ అధికారుల బృందం ఇక్కడ తనిఖీ చేసినట్లు సమాచారం.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

చెన్నూర్ రూరల్, మే 15 : రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కేంద్రాల ఇన్‌చార్జీలకు మంచిర్యాల జిల్లా సివిల్ సప్లై (డీసీఎస్‌వో) అధికారి హరికృష్ణ సూచించారు. మండలంలోని ఆస్నాద్, కాంబోజీపేట, లింగంపల్లి, కిష్టంపేట, సుబ్బరాంపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. వాతావరణంలో వచ్చిన మార్పు కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. రైతుల వద్ద బస్తా బరువు 41 కిలోలు మాత్రమే తూకం వేయాలని, ఎక్కువ వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓపీఎంఎస్ ట్యాబ్‌లో రైతుల వివరాలను వెంటనే నమోదు చేసి, రైతుల ఖాతాలో డబ్బు జమయ్యేలా చూడాలని సూచించారు. ఆయన వెంట డీఎం గోపాల్, డీటీ మధుసూదన్, సహకార సంఘం సీఈవో లక్ష్మీనారాయణ రెడ్డి, సిబ్బంది నరహరి శ్రీనివాస్ తదితరులున్నారు.

ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న డీసీఎస్‌వో హరికృష్ణ

చెస్ శిక్షణ శిబిరం సద్వినియోగం చేసుకోండి

శిక్షణ శిబిరంలో జడ్పీటీసీ సంతోష్, చెస్ జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్, నిర్వాహకులు

రెబ్బెన, మే 15 : ఉచిత చెస్ శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని రెబ్బెన జడ్పీటీసీ వేముర్ల సంతోష్, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ సంపత్‌కుమార్ సూచించారు. రెబ్బెన మండలం గోలేటిటౌన్‌షిప్‌లో గల టీబీజీకేఎస్ కార్యాలయంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఉచిత చెస్ శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని వారు ప్రారంభించారు. చెస్ మెదడుకు మేత అని, పిల్లలు చేడు అలవాట్లకు దూరంగా ఉండి, క్రీడలపై అసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్రాజు శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్, ప్రధాన కార్యదర్శి కల్పన, ఆర్గనైజింగ్ కార్యదర్శి సమ్మయ్య, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూ సార పరీక్షలు చేయించుకోవాలి

చింతలమానేపల్లి, మే 15 : ప్రతీ రైతు భూ సార పరీక్షలు చేయించుకోవాలని ఏరోస్ అగ్రో లిమిటెడ్ అధికారి క్రాంతి కుమార్ అన్నారు. భూసార పరీక్షల్లో భాగంగా మండలంలోని కర్జెల్లి శివారులోని పంట చేలలో బుధవారం మట్టి నమూనాలు సేకరించి, పరీక్షలు నిర్వహించారు. మట్టి స్వభావాన్ని బట్టి మందులు ఏ మేరకు వాడాలనేది తెలుసుకోవచ్చన్నారు. తద్వారా రైతులు అవసరానికి మించి ఎరువులు వాడకం, ఖర్చులు తగ్గించుకోవచ్చని సూచించారు. అలాగు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ సాగులో మంచి దిగుబడులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నితేశ్వర్, కాళిదాస్, సాయికుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై జాగ్రత్తలు తీసుకోవాలి

పోస్టర్, కరపత్రాలు విడుదల చేస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అనిత, అధికారులు

మంచిర్యాల ఏసీసీ, మే 15 : డెంగీ ప్రబలకుండా పకడ్బందీగా చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలి మంచిర్యాల ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అనిత అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో బుధవారం పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మే 16న జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య, ఉప కేంద్రాలు, పల్లె దవాఖానల్లో అవగాహన నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాజంలో అందరం భాగస్వాములమై డెంగీని నివారిద్దామని, కనెక్ట్ విత్ కమ్యూనిటీ కంట్రోల్ డెంగీ అనే నినాదంతో నివారణలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. పంచాయతీ, మున్సిపల్, ఐసీడీఎస్ సహకారంతో దోమల నివారణకు చర్యలు చేపడుతామన్నారు. జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లల్లో మందు పిచికారీ చేయించినట్లు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగీ కిట్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లా ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ హరీశ్ చంద్రా రెడ్డి, ఏడీ ఇస్మాయిల్, డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ విశ్వేశ్వర్ రెడ్డి, డెమో బుక్క వెంకటేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

అతడి కండ్లు సజీవం..

సదానందం (ఫైల్)

మంచిర్యాల ఏసీసీ, మే 15 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోపాలవాడకు చెందిన గడిగొప్పుల సదానందం (46) (పీడీ) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. కానీ, మరొకరి జీవితంలో వెలుగులు నింపాడు. అమెరికాలో ఉంటున్న సదానందం కూతురు, అల్లుడు (మధుప్రియ-ముఖేష్) మంచిర్యాలకు వచ్చేందుకు ఆలస్యమవుతుండడంతో మృతదేహాన్ని కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కళాశాలలో భద్రపరిచారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయి దుఃఖంలో ఉన్న ఆ కుటుంబ సభ్యులు, అంధులకు చూపును ప్రసాదించాలని ముందుకు వచ్చారు. ఈ విషయాన్ని వారి బంధువు ఇండ్ల ఓదెలు సదాశయ ఫౌండేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేఎస్ వాసుకు సమాచారం అందించారు. ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ ప్రతినిధి కృష్ణారెడ్డి సహకారంతో కరీంనగర్‌లోని ఐ బ్యాంక్ టెక్నీషియన్ సతీశ్ ద్వారా సదానందం కండ్లను బుధవారం సేకరించి, హైదరాబాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు. ఈ సందర్భంగా నేత్రదానానికి ముందుకు వచ్చిన సదానందం భార్య సంధ్య, చిన్న కూతురు బిందు, సోదరుడు చందుతో పాటు బంధువు ఇండ్ల ఓదెలను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, గౌరవ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, సలహాదారులు నూక రమేశ్, జాతీయ కార్యదర్శి లింగమూర్తి, రాష్ట్ర కార్యదర్శులు భీష్మాచారి, కేఎస్ వాసు తదితరులు అభినందించారు.

వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థులకు బోధిస్తున్న డీఈవో పార్శి అశోక్

కాగజ్‌నగర్, మే 15 : విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఈవో పార్శి అశోక్ సూచించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని డీఆర్సీ కార్యాలయంలో ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. పదో తరగతి తర్వాత చదువుకునేందుకు భౌతిక రసాయన శాస్త్రంలో మూల అంశాలపై అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ.. తను పాలిటెక్నిక్ చదివి ఉన్నతమైన డివిజన్ స్థాయిలో ఉద్యోగం చేస్తున్నానని, పేద విద్యార్థులు ఉన్నతస్థానాన్ని చేరుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ కటుకం మధూకర్, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయుడు మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోచమ్మ గుడి నిర్మాణానికి విరాళాలు

తాండూర్, మే 15 : తాండూర్ మండల కేంద్రంలోని కొత్తగుడిసెలు ప్రాంతంలో పోచమ్మతల్లి నూతన గుడి నిర్మాణానికి దాతలు విరాళాలు ఇవ్వగా, ఆలయ కమిటీ నిర్వాహకులు బుధవారం రసీదులను అందజేశారు. ఇక్కడి గుడి శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణానికి అందరూ చందాల రూపంలో విరాళాలు సేకరించారు. వీటితో పాటు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజల సహకారంతో ఆలయ నిర్మాణ పనులు పూర్తిచేస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎలుక రామచందర్ తెలిపారు. ఆయన రూ.51,116, ఇడిదినేని లక్ష్మణ్ రూ.37,500 విరాళం అందించంగా, వారికి రసీదులను అందజేశారు. ఉపాధ్యక్షుడు మద్దిబోయిన గోపా ల్, ఆలయ కమిటీ నిర్వాహకులు పురంశెట్టి శంకర్, వావిలాల రమేశ్, కటకం శ్రీనివాస్, సప్ప హరీశ్, పుల్లం శ్రీకాంత్, గోలెం వంశీ, సిద్ధం సాయి శంకర్, ఇడిదినేని లక్ష్మణ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దాతలకు రసీదు అందజేస్తున్న కమిటీ నిర్వాహకులు

పిడుగు పడి మహిళకు గాయాలు

రెబ్బెన, మే 15 : రెబ్బెన మండలం కొండపల్లి గ్రామానికి చెందిన సోన్లే యమునాబాయి(52)పై బుధవారం పిడుగు పడడంతో గాయాలైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం ఇంటి ఆవరణలోని బావి వద్ద పనులు చేస్తుండగా, ఒక్క సారిగా పిడుగు పడింది. గాయాలవడంతో కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని దవాఖానకు తరలించారు. యమునాబాయి ఆరోగ్యం నిలకడగనే ఉన్నదని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇద్దరికి జైలు శిక్ష

కన్నెపల్లి,మే 15 : కన్నెపల్లి మండలంలోని లింగాల గ్రామానికి చెందిన చౌదరి వెంకన్న మృతికి కారకులైన చౌదరి లక్ష్మికి ఐదేండ్లు, దన్నూరి రాజుకు మూడేండ్ల జైలు శిక్ష విధిస్తూ బుధవారం మంచిర్యాల కోర్టు తీర్పునిచ్చిందని ఎస్ఐ గంగారం తెలిపారు. చౌదరి వెంకన్న భార్య చౌదరి లక్ష్మి దన్నూరి రాజుతో వివాహేతర సంబంధం పెట్టుకొని వెంకన్నను మనస్తాపానికి గురిచేశారు. దీంతో 2019లో వెంకన్న పురుగుల మందు తాగి దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వెంకన్న అన్నయ్య చౌదరి మధూకర్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. ఏపీపీ మదన్‌మోహన్, కోర్టు కానిస్టేబుల్ గట్టయ్య బుధవారం నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైందని ఎస్ఐ వివరించారు.

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న ఇండెన్ గ్యాస్ సిబ్బంది

కాగజ్‌నగర్, మే 15 : కాగజ్‌నగర్ పట్టణంలోని పలు వార్డుల్లో ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా గ్యాస్ ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వినియోగాదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బేసిక్ సేఫ్టీ క్లినిక్‌లో భాగంగా ఇంటింటా తిరుగుతూ వివరిస్తున్నారు. కాగజ్‌నగర్ డివిజన్‌లోని 25వేల మంది గ్యాస్ వినియోగాదారులకు ఇంటికి వెళ్లి అవగాహన కల్పిస్తామని సిబ్బంది తెలిపారు.

మృతుడి కుటుంబానికి సాయం

చెక్కు అందజేస్తున్న ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

రామకృష్ణాపూర్, మే 15 : రామకృష్ణాపూర్‌లోని శివాజీ నగర్‌కు చెందిన మేకల వ్యాపారి కలవేన సంపత్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, కుటుంబానికి ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయంగా రూ.10వేల చెక్కు అందజేశారు. బుధవారం ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు పరామర్శించారు. సంపత్ కడుపులో పెద్దపేగు ముడిపడడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో ఆపరేషన్ చేసుకున్నాడని, అనంతరం కడుపులో ఇన్ఫెక్షన్ వచ్చి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు బీ లక్ష్మణ్, కోశాధికారి టీ సురేశ్, ప్రచార కార్యదర్శి శరత్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు.

సమయం వృథా చేయవద్దు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

రెబ్బెన, మే 15 : వేసవిలో పిల్లలు సమయాన్ని వృథా చేయవద్దని తక్కలపల్లి కాంప్లెక్స్ సీఆర్పీ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని గోలేటి గ్రామంలో బుధవారం రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన కథలను పిల్లలకు వినిపించారు. పిల్లలు కథల పుస్తకాలు చదివి, విజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న సేఫ్టీ ఆఫీసర్ రాజమౌళి

లక్సెట్టిపేట, మే 14 : పట్టణంలోని ఊత్కూర్ చౌరస్తాలో మంచిర్యాల ఆర్టీసీ డిపో అధికారులు ప్రయాణికులకు, ప్రజలకు రోడ్డు భద్రతపై బుధవారం అవగాహన కల్పించారు. సంస్థ సేఫ్టీ వార్డెన్ రాజమౌళి మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చాలా సురక్షితమన్నారు. బస్సులను ఓవర్‌టేక్ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బస్టాండ్‌కు వచ్చి, గంటల తరబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన అవసరం లేదని, గమ్యం ఆప్ ద్వారా బస్సు ఎక్కడ ఉన్నదో తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో లక్సెట్టిపేట కంట్రోలర్లు రవీందర్, మోహన్ పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మే 15 : జైనూర్ మండల కేంద్రంలో చిన్న చిన్న కారణాలతో హిందువుల కుటుంబాలపై ముకుమ్మడిగా దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని హిందూ వాహిని జిల్లా ఉపాధ్యక్షుడు సైదం నాగరాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. చిన్న కారణాలతో మారు 500 మందితో ఒడ్డేర్ గూడలో దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తునామని, ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ గొడవలకు కారణాలపై పూర్తిస్థాయిలో పారదర్శకంగా విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డల ప్రణయ్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ తదితరులు ఉన్నారు.